క్లుప్తంగా

26,27న క్రీడాకారుల ఎంపికలు

సింగరాయకొండ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14, 17 బాలబాలికల అథ్లెటిక్స్, బాడ్మింటన్‌లో ఎంపికలు జరగనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కె. మాల్యాద్రి, సయ్యర్ జంషీర్ అబ్దుల్ తెలిపారు. ఈనెల 26న నియోజకవర్గ స్థాయిలో అథ్లెటిక్స్, బాడ్మింటన్ పోటీలు, ఈనెల 27న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు ఆ ప్రకటనలో వివరించారు.

సీపీఎస్ రద్దు చేయండి

కందుకూరు: ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఫ్యాప్టో నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కళ్లగుంట మోహన్‌రావు, ముప్పరాజు కోటేశ్వరరావు, ఎస్.కె మునీర్‌భాష, అశోక్‌బాబు పాల్గొన్నారు.

విద్యార్థినులకు వైద్య పరీక్షలు

లింగసముద్రం: మండలంలోని పెదపవనిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో లింగసముద్రం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డా.రమేష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ స్నేహలత, డాక్టర్ అనూరాధ, సీమెచ్‌ఓ జి.శ్రీనివాసులు, వైద్యసిబ్బంది కాదర్, గౌతం, మహిమ, అంకమ్మ, జోగేశ్వరరావు పాల్గొన్నారు.

పాడి రైతులకు రుణ సదుపాయం


అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ మాధవరావు

పొన్నలూరు: జగనన్న పాలవెల్లువ కార్యక్రమం ద్వారా పాడి రైతులకు బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని మాలపాడు గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. పశువైద్యాధికారి శివరామకృష్ణ, పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ మృదుల, సీసీ మాధవ, సిరిగిరి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ సెమినార్‌లో తృతీయ బహుమతి


ప్రశంస పత్రం తీసుకుంటున్న మహాల

టంగుటూరు (జరుగుమల్లి): ఒంగోలు పీవీఆర్ గరల్స్ హై స్కూల్‌లో శనివారం జరిగిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో జి. మహాల తృతీయ స్థానం సాధించింది. నేషనల్ సైన్స్ సెమినార్‌కి అధికారిగా రమేష్, న్యాయ నిర్ణేతలుగా భిక్షాలు, జగన్నాథం వ్యవహరించారు. టంగుటూరు మండలం జమ్ములపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహాల 10వ తరగతి చదువుతోంది. గైడ్ టీచర్‌గా అన్నపూర్ణ వ్యహరించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మహాలను, టీచర్‌ను అభినందించారు.

108 వాహనంలో ప్రసవం


బిడ్డను బంధువులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

మర్రిపూడి: గర్భిణి 108 వాహనంలో కాన్పు కాగా తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్న సంఘటన శనివారం జరిగింది. గార్లపేట గ్రామానికి చెందిన ఇండ్ల కుమారికి పురిటి నొప్పులు రావడంతో ఈఎంటీ ఏ పెద్దిరాజు, పైలెట్ బి. శ్రీనివాసులు 108 వాహనంలో కనిగిరి తీసుకెళ్లే క్రమంలోఅధికంగా నొప్పులు వచ్చాయి. రాగిమానపల్లి గ్రామ సమీపంలోకి వెళ్లాక వాహనంలోనే కాన్పు అయి ఆడశిశువుకు జన్మనిచ్చింది.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

రాచర్ల: మండలంలోని సత్యవోలు సచివాలయం పరిధి రంగారెడ్డిపల్లెలో ఆదివారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యేలం మురళీకృష్ణ శనివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు హాజరవుతారని చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నిమజ్జనం


మహా గణపతికి నమస్కరిస్తున్న అశోక్‌బాబు


మర్రిపూడి: గంజిపాలెంలో పూజలు అందుకున్న వినాయకుడు


టంగుటూరు: హోమం చేస్తున్న దత్తాత్రేయ శర్మ


సింగరాయకొండ: పాకల తీరంలో భారీగా తరలివచ్చిన విగ్రహాలు


నిమజ్జనానికి తరలుతున్న పాతూరులోని గణపయ్య


డీజేపేటలో నిమజ్జనోత్సవంలో భక్తులు

ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి

టంగులూరు (జరుగుమల్లి): గ్రామ ప్రజానీకం, కొండపి నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కొండపి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు ఆకాంక్షించారు. టంగుటూరులోని బ్రహ్మంగారి గుడి వద్ద మహా గణపతి విగ్రహ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఏఎంసీ డైరెక్టర్లు కొమ్ము సురేంద్ర, టంగుటూరి రామకృష్ణ, దుగ్గిరాల పేర్రాజు, కిరణ్, కొమ్ము బుజ్జి పాల్గొన్నారు.

హాస్పిటల్‌పై దుష్ప్రచారం చేస్తే చర్యలు

కందుకూరు: స్థానిక ఏరియా వైద్యశాల పనితీరుపై సామాజిక మాధ్యమాల వేదికగా దుష్ప్రచారం చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హాస్పిటల్ సూపరింటెండెంట్ శకుంతల హెచ్చరించారు. శనివారం ఆమె మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మౌనిక అనే మహిళ చంటి బిడ్డతో హాస్పిటల్‌కు వచ్చినట్లు, ఇక్కడి డాక్టర్‌లు టెస్టు, మందులు బయట కొనుగోలు చేసుకోవాలని సూచించినట్లు ప్రచారం చేశారన్నారు. కానీ మౌనిక అనే మహిళ హాస్పటల్‌కు చికిత్స కోసం రాలేదన్నారు. అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, రక్త పరీక్షలు ఇక్కడే చేస్తున్నామని చెప్పారు. అలాగే అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డాక్టర్ ఇంద్రాణి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఈ క్రాప్ చేయించుకోవాలి

పీసీపల్లి: మండలంలో పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. ఈక్రాప్ నమోదు చేసుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల ద్వారా పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వ ఆర్థిక సాయం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమ పంటను స్థానిక ఆర్‌బీకే కేంద్రాల్లో ఉండే వ్యవసాయ సహాయకుల ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల పక్షపాతిగా వ్యవహరిస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలున్నా తమనకు సంప్రదించాలన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి


రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: సచివాలయ సిబ్బంది సమయపాలన విధిగా పాటించాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలో 3వ వార్డు సచివాలయాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ గఫార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను క్షేత్ర స్థాయిలో తక్షణం పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. సమస్యలపై వచ్చిన అర్జీదారులతో వారి సమస్యను సమగ్రంగా తెలుసుకుని తగిన వివరణ ఇవ్వాలన్నారు. ఉద్దేశపూర్వకంగా కార్యాలయాల చుట్టూ అర్జీదారులను తిప్పుకోవద్దని హెచ్చరించారు. విధి నిర్వహణలో బయటకు వెళ్లే సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. సచివాలయ అడ్మిన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఆటల పోటీలు


క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు →



కనిగిరి రూరల్: మూడు రోజుల నుంచి ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఆటల పోటీలు శనివారంతో ముగిశాయి. మండలంలోని కంచర్లవారిపల్లిలో జరుగుతున్న అండర్ 14, అండర్ 17 పోటీలను హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి మూడోరోజు ప్రారంభించారు. ఆరు మండలాల నుంచి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కబడ్డీ, రన్నింగ్, లాంగ్ జంప్, అథ్లెటిక్స్ పోటీలు అత్యంత ఆసక్తికరంగా సాగాయి.

నియోజకవర్గస్థాయి పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27న సింగరాయకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే జిల్లా స్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపికలో పాల్గొంటారని నియోజకవర్గ కో ఆర్డినేటర్ బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. పీడీలు, పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ వేలం పలికిన లడ్డూ ప్రసాదం


లడ్డూను తీసుకెళ్తున్న కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు


గణేష్ విగ్రహం వద్ద ప్రత్యేక పూజల్లో చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు

కనిగిరి రూరల్: పట్టణంలోని వాల్మీకివీధిలో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం వద్ద గణపతి లడ్డు వేలం పాట శనివారం రాత్రి జరిగింది. విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన రెండు లడ్డులకు వేలం పాట జరగ్గా పెద్ద లడ్డు రూ.1.52 లక్షలకు బత్తుల మహేష్ పాడుకోగా, రెండో లడ్డు కాకునూరి వెంకటేశ్వర్లు రూ.70 వేలకు పాడుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రామాలయం వీధిలోని కొలువైన గణపతి విగ్రహం వద్ద లడ్డును వేలం పాటలో రూ.75 వేలకు కొలిపర్తి వెంకట స్వామి పాడుకున్నట్లు కమిటీ తెలిపారు. శనివారం రాత్రి వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అనంతరం జరిగిన ప్రత్యేక పూజల్లో కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు చొప్పరపు మాధవి, దేవకి సత్యావతి, గృహసారధులు, నాగూర్‌బీ, భారతీ, మాజీ ఎంపీటీసీ వీరం రెడ్డి బ్రహ్మరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు రూరల్: మండలంలోని కోవూరులోని రెడ్డిగారి సత్రంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం ఏర్పాటు చేశారు. ఆరు రోజులపాటు విశేష పూజలు అందుకున్న వినాయకస్వామి నిమజ్జనం సందర్భంగా శనివారం లడ్డూ వేలంపాట జరిగింది. 30 కేజీల లడ్డూతో పాటు 250 గ్రాముల వెండి ప్లేటును గ్రామానికి చెందిన దారుకుమల్లి కృష్ణారెడ్డి, ఆయన కుమారులు నరసింహా రెడ్డి, చైతన్య రూ.1,50,116 వేలంలో హెచ్చు పాట పాడి లడ్డూను దక్కించుకున్నారు. గణేష్ ఉత్సవ కమిటీ స్థానికులు వారికి అభినందనలు తలిపారు. అట్టహాసంగా మేళతాళాలతో ఊరేగింపుగా కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులను లడ్డును ఇంటికి తీసుకెళ్లారు. గత ఏడాది లడ్డూ పాట కంటే ఈ ఏడాది రూ.20వేలు అధికంగా పలికిందని కమిటీ సభ్యులు తెలిపారు.

జగనన్న పాలవెల్లువను వినియోగించుకోవాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాగుల్‌మీరా కోరారు. శనివారం మండలంలోని శతకోడులో సర్పంచ్ పి.జ్యోతి ఆధ్వర్యంలో రైతులకు పాల వెల్లువపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాగుల్‌మీరా మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు పాలవెల్లువ పథకం ఎంతో దోహదం చేస్తుందన్నారు. ఏపీఎం వెంకటయ్య మాట్లాడుతూ స్త్రీనిధి, ఉన్నతి పథకాల ద్వారా గ్రామాల్లో ఎస్‌హెచ్‌జీ మహిళకు రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణం పొంది పాడి పరిశ్రమను పెట్టుకుని జీవనోపాధి మెరుగు పర్చుకోవచ్చ సూచించారు.

స్థలం కేటాయింపు

యర్రగొండపాలెం: మహిళలు వ్యాపార పరంగా ఎదగాలన్న ఉద్దేశంతో స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో మహిళా మార్ట్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలన్న రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అభ్యర్థన మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్ అనుమతి ఇస్తూ ఉత్తర్వూజారీ చేశారు. శనివారం అందాయి. మార్ట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

సచివాలయం తనిఖీ

కంభం: కందులాపురం-1 సచివాలయాన్ని ఎంపీడీఓ ఎస్.ప్రసాద్‌బాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. సచివాలయం పరిధిలో జరుగుతున్న సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కందుకూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ కందుకూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ శర్మిష్ట అన్నారు. శనివారం దూబగుంట అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, కార్యకర్తలు నల్లపు మాధవి, వై స్వాతి, డి. సునీత, బి. ఈశ్వరమ్మపాల్గొన్నారు.

గుడ్లూరు: గర్భిణులు, బాలింతల సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం అందిస్తున్నట్లు సూపర్‌వైజర్ కామేశ్వరి అన్నారు. చినలాటరఫి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పోషణ మహా కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ శివపార్వతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: శామీరపాలెంలో శనివారం అవగాహన కార్యాక్రమం సీడీపీఓ శర్మిస్తా సూచనలు మేరకు నిర్వహించినట్లు సూపర్‌వైజర్ సునీత తెలిపారు. ఉషారాణి, కళ్యాణి, నాగశిరోమణి, శిరీష పాల్గొన్నారు.

పామూరు: పౌష్టికాహార ఆవశ్యకతను గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు గుర్తెరగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గోళ్ల పద్మజ అన్నారు. మోపాడు ఎస్సీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు.

ఆటల పోటీల్లో ముండ్లమూరు విద్యార్థుల సత్తా

ముండ్లమూరు: దర్శి నియోజకవర్గ స్థాయి ఆటల పోటీల్లో ముండ్లమూరు విద్యార్థులు సత్తాచాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 21, 22 తేదీల్లో దర్శిలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో పలు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పీడీ భవన్నారాయణ తెలిపారు. హైజంప్ అండర్-14 బాలుర విభాగంలో తాతపూడి దినేష్ మొదటి స్థానం, త్రోబాల్‌లో గండి దేవసహాయం, చల్లా మణికంత, టెన్నికాయిట్‌లో వరగాని రాజేష్, దాసరి నైసన్‌బాబు, వరగాని ధనుష్, టెన్నికాయిట్ బాలికల విభాగంలో మీనిగ రేణుక, గోళ్లపాటి వైష్ణవి, త్రోబాల్‌లో తాతపూడి దీక్ష విజయం సాధించినట్లు వివరించారు. అండర్-17 బాలుర విభాగం 200 మీటర్ల పరుగు పందెంలో కాకునూరి వంశీ ద్వితీయ స్థానం, ఎనుముల సాయిచరణ్ ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం, 800 మీటర్ల పరుగు పందెంలో బిజ్జం శివారెడ్డి మొదటి స్థానం, హైజంప్‌లో తాతపూడి జస్సీపాల్ మొదటి స్థానం, త్రోబాల్‌లో కొమ్మల నాగ చరణ్, రావుపల్లి లవకుమార్, సాయిచరణ్, డిస్క్ త్రోలో కొండవీటి రాకేష్ తృతీయ స్థానం సాధించారు. అండర్-17 బాలికల విభాగం త్రోబాల్‌లో కొంకా అమృతవర్షిణి, శ్రీలక్ష్మి విజయం సాధించినట్లు పీడీ తెలిపారు.

ప్రకృతి ప్రసాదించే ఆహారంతో ఎంతో శక్తి

దర్శి: ప్రకృతి ప్రసాదించే ఆహార పదార్థాలు ఎంతో శక్తినిస్తాయని పోషణ్ అభియాన్ హెచ్‌ఎస్ జీ రమణ అన్నారు. స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో శనివారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. నిత్యావసర సరుకులు, కూరగాయలతో చక్కగా శక్తినిచ్చే ఆహార పదార్థాలు తయారు చేశారు.

అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ


అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డు సిపానీ బజారులో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద సంతాన విఘ్నేశ్వరస్వామి వారికి శనివారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అందరూ ఐక్యంగా ఉండి విఘ్నేశ్వర నవరాత్రులను నిర్వహించడం అభినందనీయమని కమిటీ సభ్యులను మెచ్చుకున్నారు. అనంతరం 20వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ సలీం, శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు నాలి కొండయ్య యాదవ్, సచివాలయం అధ్యక్షుడు షేక్ కరీముల్లా, షేక్ సుభానీ, నిర్వాహకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం కమిటీ సభ్యులు కేపీ నాగార్జునరెడ్డిని ఘనంగా సన్మానించారు.

స్వచ్ఛతపై అవగాహన అవసరం


స్వచ్ఛత ర్యాలీలో వైస్ చైర్మన్ శాంతి, కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్గి ఉండాలని మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా శనివారం 18వ వార్డులోని పాఠశాలల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం లభిస్తోందన్నారు. ప్రతి విద్యార్థికి తరగతి గదుల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సి ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, సచివాలయ శానిటరీ సెక్రటరి మాలకొండయ్య, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం


సమస్యలపై చర్చిస్తున్న సుబ్బయ్య, హుసేన్‌రెడ్డి

పామూరు: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జెడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బుక్కాపురం ఎస్సీకాలనీలో శనివారం స్థానిక సర్పంచ్ మోరబోయిన గోవర్ధన రాధాకృష్ణతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా కాలనీలోని మహిళలు, ఇతరులతో స్థానిక సమస్యలపై చర్చించారు. కాలనీలో నీటి సమస్య తరచు తలెత్తుతోందని, సీసీరోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా ఓవర్‌హెడ్ ట్యాంకు ద్వారా నీటి సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. దీనిపై స్పందించిన వారు త్వరలో డీబ్‌బోర్ వేయించి నీటి సమస్య పరిష్కరిస్తామని, అదేవిధంగా సీసీరోడ్ల నిర్మాణ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామన్నారు. నాయకులు మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, కాలనీవాసులు ఉన్నారు.

రూ.90 వేల విరాళం అందజేత


నగదును హెచ్‌ఎంకు అందజేస్తున్న దాతలు నాగార్జున, నాగరాజు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని చెన్నపునాయునిపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం గ్రామానికి చెందిన దాతలు తమ సొంతనిధులతో వ్యాన్ సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా శనివారం పాఠశాలలో హెచ్‌ఎం చాంద్‌బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దాతలు యనమల నాగార్జున, నాగరాజు కుటుంబసభ్యులు నెలకు రూ.10 వేల వంతున రూ.90 వేలను పాఠశాల హెచ్‌ఎం చాంద్‌బాషాకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సహచర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలి

పీసీపల్లి: బీఎల్‌ఓలు బాధ్యతగా పనిచేయాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం జరిగిన బీఎల్‌ఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఎల్‌ఓలు ఇంటింటా తిరిగి మరణించిన వారి ఓటర్లను, కొత్తగా నమోదు చేసుకునే ఓట్లను, ఆధార్ ఓటు అనుసంధానం చేయాలన్నారు.

ట్రాన్స్‌జెండర్ ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించాలన్నారు. ఓటర్ల సర్వే పారదర్శకంగా చేయాలని ఆదేశించారు.

28న నూకతోటి ప్రసాద్ సంస్మరణ సభ

కందుకూరు రూరల్: మండల విద్యాశాఖాధికారిగా పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన నూకతోటి ప్రసాద్ సంస్మరణ సభ ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బీటీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. డిప్యూటీ ఈఓ శ్రీనివాసరావు, బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోహన్‌రావు, అడిషనల్ సెక్రటరీ సంగ మహేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ యలమంద, డివిజన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొంటారని తెలిపారు.